
సాక్షి పల్నాడు

మంగళవారం । 22 । జూలై । 2025



ఆషాఢ సారె సమర్పణ

నరసరావుపేటఈస్ట్: ఆషాఢ మాసం పురస్కరించుకొని నరసరావుపేట శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మవారికి భక్తులు సోమవారం సారె సమర్పించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 568.30 అడుగులకు చేరింది. జలాశయం నుంచి ఎస్ఎల్బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



గుంటూరులో భారీ వర్షం

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. నగరంలోని పలు రహదారులు జలమయమయ్యాయి.

న్యూస్‌రీల్

జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయిలో నిర్వహించే ఎన్ఎంఎంఎస్ పరీక్షలో భాగంగా 2024 డిసెంబర్‌లో జరిగిన పరీక్షలో ఎంపికైన విద్యార్థులు ఆగస్టు 31వ తేదీ లోగా స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు తమ వివరాలను www.schoarships.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసి దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. విద్యార్థి తన వివరాలలో ఏ ఒక్క అక్షరం తేడాగా నమోదు చేసినా స్కాలర్‌షిప్ మంజూరు కాదని స్పష్టం చేశారు. మెరిట్ లిస్టులో ఉన్న విధంగా ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలు నమోదు చేయాలని తెలిపారు. నమోదు చేసిన దరఖాస్తును జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందచేయాలన్నారు. ఈఏడాది 10, 11, 12 తరగతులు చదువుతున్న విద్యార్థులు తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. రెన్యువల్ చేయని విద్యార్థులకు స్కాలర్‌షిప్ రాదని తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గణిత, రసాయనశాస్త్ర అధ్యాపక పోస్టులను అతిథి అధ్యాపకులతో భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 24లోపు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ బి.ఉమాదేవి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధించి సబ్జెక్టు పీజీలో 55 శాతం మార్కులు పొంది ఉండాలని, ఎంపిక ప్రక్రియ డెమో ద్వారా నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 24లోపు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు.. ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 26న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

వైద్య అధికారులతో డీఎంహెచ్ఓ సమావేశం



గుంటూరు మెడికల్: డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అధ్యక్షతన గుంటూరు జిల్లాలో ఏప్రిల్ 25 – జూన్ 25 వరకు జరిగిన 8 శిశు, చంటి పిల్లల మరణాలపై రివ్యూ కమిటీ సమావేశం డీఎంహెచ్ఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. మరణాలకు కారణాలు, అందించిన వైద్య సేవలు, గృహ సందర్శనలు వివరాలపై చర్చించారు. గుంటూరు నగరంలోని బొంగరాలబీడు, మారుతీనగర్, పొన్నెకల్లు ఆరోగ్యకేంద్రాల పరిధిలో నమోదైన కేసులపై ఆరా తీశారు. సమావేశంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాలు అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, చిన్నపిల్లల వ్యాధుల నిపుణులు డాక్టర్ దేవకుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భవాని, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీడియాట్రిక్ సభ్యులు డాక్టర్ ఎస్.రాధామాధవి, డాక్టర్ రోహిణి రత్నశ్రీ , ఈఓఐసీడీఎస్ సుబ్బమ్మ, ఐద్వా ఎన్జీఓ అరుణ తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా వరదనీరు విడుదల

తాడేపల్లిరూరల్: ప్రకాశం బ్యారేజ్ ఎగువ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురియడంతో పలు వాగుల నుంచి వరదనీరు ప్రకాశం బ్యారేజ్ వద్దకు చేరింది. సోమవారం సాయంత్రం స్వల్పంగా వరదనీటిని ప్రకాశం బ్యారేజ్ దిగువ ప్రాంతానికి విడుదల చేశారు. ప్రకాశం బ్యారేజ్ జేఈ రమేష్ మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజ్ వద్దకు మునేరు ఇతర వాగుల నుంచి 5,300 క్యూసెక్కులు చేరిందని, ప్రకాశం బ్యారేజ్ వద్ద నీటిమట్టాన్ని 12 అడుగులు మెయింటెన్ చేస్తూ విజయవాడ వైపు ఒక అడుగు మేర 4 గేట్లు ఎత్తి కృష్ణానది దిగువకు 2900 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామని తెలిపారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 2522 క్యూసెక్కులు వదిలినట్లు ఆయన తెలిపారు.

కందకంలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



తాడికొండ: ఆర్టీసీ బస్సు అదుపుతప్పి కందకంలోకి దూసుకెళ్లిన ఘటన తాడికొండ శివారు పెదపరిమి రోడ్డులో జరిగింది. సోమవారం మధ్యాహ్నం సుమారు 30 మంది ప్రయాణికులతో గుంటూరు వైపు నుంచి తుళ్ళూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు తాడికొండ దాటిన తరువాత కందకంలోకి దూసుకెళ్లింది. ఇద్దరు మహిళలతోపాటు పలువురు పురుషులకు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ దూకుడుగా నడిపాడని, చిన్నగా వెళ్లాలని హెచ్చరించినా పెడచెవిన పెట్టడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని ప్రయాణికులు వాపోయారు.

నిర్లక్ష్య విపత్తు

అదును ముంచుకొస్తున్నా.. వరి విత్తనాల పంపిణీ లేదన్నా..?

- వరి నారుమళ్లకు సిద్ధమైనా అందుబాటులోకి రాని వరి విత్తనాలు
- అరకొరగా వచ్చిన విత్తనాలను పంపిణీ చేసి చేతులు దులుపుకొంటున్న వ్యవసాయ శాఖ
- ఇప్పటికే అదును ఆలస్యమవుతుండటంతో ఆందోళనలో రైతులు
- బ్లాక్ మార్కెట్‌లో దోచుకుంటున్న ప్రైవేటు వ్యాపారులు
- కూటమి ప్రభుత్వంపై విరుచుకు పడుతున్న రైతన్నలు
- గత ఖరీఫ్‌లో ఎన్నడూ లేని విధంగా వరి విత్తనాల కొరత
- జేజీఎల్–384రకం కోసం జోరువానలో రైతుల పడిగాపులు
- గతేడాది చేదు అనుభవాలు ఉన్నా జాగ్రత్త పడని వ్యవసాయ శాఖ అధికారులు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆర్‌బీకేల ద్వారా గ్రామాల్లోనే ఎరువులు, విత్తనాలు



గతేడాది జేజీఎల్-384 రకం వరి విత్తనాల కోసం నరసరావుపేటలో జోరువానలో క్యూలైన్‌లో నిలుచున్న రైతులు (ఫైల్)

సాక్షి, నరసరావుపేట: ఖరీఫ్ సాగు ప్రారంభమై సుమారు రెండు నెలలు కావస్తోంది.. ఓ వైపు వర్షాలు మొదలయ్యాయి.. మరోవైపు వారం పది రోజుల్లో సాగర్ కుడికాలువ నుంచి నీరు వదులుతామని అధికారులు చెబుతున్నారు. వరి నారు పోయడానికి ఇప్పటికే ఆలస్యమవడంతో రైతులు సిద్ధమవుతున్న వేళ కూటమి ప్రభుత్వ ఆలసత్వం రైతుల పాలిట శాపంగా మారుతోంది. ఏటా జూన్, జూలై నెలల్లో వ్యవసాయ శాఖ అధ్వర్యంలో సబ్సిడీపై వరి విత్తనాలను పంపిణీ చేసేవారు. ఈ ఏడాది జూలై చివరి వారం వచ్చినా ఇంకా సబ్సిడీ విత్తనాల పంపిణీ చేయలేదు. నకరికల్లు మండలంలో గుండ్లపల్లి లాంటి ఒకటి రెండు చోట్ల మాత్రమే అరకొరగా సబ్సిడీ వరి విత్తనాల పంపిణీ ప్రారంభించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల వద్ద కనీసం జిల్లాలో ఇప్పటి వరకు ఏ పంట ఎంత మేరకు సాగు చేశారన్న సమాచారం కూడా లేకపోవడం శోచనీయం. జిల్లాలో ఈ ఏడాది సుమారు 40 వేల హెక్టార్లలో వరిసాగు చేసే అవకాశాలున్నాయి. అన్ని రకాల వరి విత్తనాలు కలిపి జిల్లాకు సుమారు 24 వేల క్వింటాళ్లు అవసరం కానుంది.

గతేడాది చేదు అనుభవాలున్నా...

కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని గాలికొదిలేసింది. ఎన్నికల ముందు అలవి కాని వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాల సరఫరాలో పూర్తిగా విఫలమయ్యారు. గత ఏడాది ఖరీఫ్‌లో సకాలంలో వర్షాలు కురవడం, నాగార్జున సాగర్ జలాశయం నిండటంతో రైతులు వరి సాగుపై దృష్టిసారించారు. వరి విత్తనాల సరఫరాపై ప్రభుత్వం ముందస్తుగా సిద్ధం కాకపోవడంతో విత్తన కొరత ఏర్పడింది. ప్రధానంగా జేజీఎల్–384 రకం విత్తనాల కోసం రైతుల నుంచి డిమాండ్ అధికంగా వచ్చింది. దీనికి అనుగుణంగా ప్రభుత్వం విత్తనాలను సరఫరా చేయాల్సి ఉండగా ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదు.





నకరికల్లు మండలంలో బోరు బావుల కింద సాగు చేసిన వరి నారుమడి

ఆర్బీకేల నిర్వీర్యంతో..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాలు బాగా పనిచేయడంతో రైతులకు అవసరమైన విత్తనాల రకాలను ముందుగానే గుర్తించి ఆ దిశగా సరఫరా చేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేయడంతో సమస్య జఠిలమైంది. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు విత్తనాల కోసం వారం రోజులుగా తీవ్రంగా ఇబ్బందిపడాల్సి వచ్చింది. రైతులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేశారు. తీవ్ర వర్షంలో రైతులను క్యూలో నిల్చోబెట్టి విత్తనాలు పంపిణీ చేయాల్సి వచ్చింది. గతేడాది చేదు అనుభవాలున్నా వ్యవసాయ శాఖ మాత్రం మొద్దునిద్ర వీడలేదు. ఓ వైపు ఆగస్టు నెల వసున్నా.. వర్షాలు విపరీతంగా కురుస్తున్నా.. మరో వారంలో రోజుల్లో సాగర్ నిండే అవకాశాలున్నా ఇంకా జిల్లాకు పూర్తిస్థాయిలో వరి విత్తనాలు అందుబాటులోకి రాని దుస్థితి.

వెంటనే సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేయాలి



వర్షాభావ పరిస్థితుల వల్ల ఇప్పటికే వరి నారు సాగు ఆలస్యమైంది. మరోవైపు ప్రభుత్వం ఇంకా సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ చేయ లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆర్‌బీకేల ద్వారా సర్వేలు చేసి రైతులకు అవసరమైన విత్తనాలు గుర్తించి సకాలంలో పంపిణీ చేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం రైతు సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఫలితంగా విత్తనాలు, ఎరువులు అందుబాటులో లేక అధిక ధరలకు బ్లాక్ మార్కెట్‌లో కొనాల్సిన దుస్థితి ఏర్పడింది.

– అన్నెం పున్నారెడ్డి, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు

బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలు

కూటమి ప్రభుత్వం, వ్యవసాయశాఖ అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు అవసరమైన విత్తనాలు లేకపోవడంతో ప్రైవేట్ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న ప్రైవేట్ వ్యాపారులు బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో బోర్ల కింద వరి సాగు చేసే వారు నారుమళ్లు పోశారు. వారికి ఆర్‌బీకేలలో విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో తప్పనిసరిగా ప్రైవేట్ దుకాణాలలో, బ్లాక్ మార్కెట్‌లో కొనాల్సి వస్తోంది.

- వరి విత్తనాల కొరతపై జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎం.జగ్గారావును వివరణ కోరగా ఇండెంట్ పంపామని, ఇంకా విత్తనాలు జిల్లాకు చేరలేదని రాగానే పంపిణీ చేస్తామని తెలిపారు.

పప్పన్నం తినలేం!

రేషన్ సరుకుల్లో కందిపప్పు కట్

- జిల్లాలో చౌక దుకాణాల్లో కానరాని వైనం
- కేవలం బియ్యం, అరకొర పంచదారతోనే సరి
- బహిరంగ మార్కెట్‌లో మండుతున్న కందిపప్పు ధర
- నిరుపేదలను చిన్నచూపు చూస్తున్న కూటమి ప్రభుత్వం



సత్తెనపల్లి: జిల్లాలో చౌక దుకాణాల్లో కందిపప్పు పంపిణీ చేయకపోవడంతో కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసే స్థోమత లేక పోవడంతో ఇక కందిపప్పుపై ఆశలు వదులుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యవసరాల ధరలకు రెక్కలు వచ్చాయి. కందిపప్పు ధర అయితే ఎన్నడూ లేని విధంగా అమాంతం పెరిగిపోయింది. పౌరసరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేసే కందిపప్పును వినియోగించుకుందామని తెల్ల రేషన్ కార్డుదారులు ఆలోచిస్తుంటే ప్రభుత్వం వారి ఆశలపై నీళ్లు చల్లింది. ఈ ఏడాది జనవరిలో కొద్దిమందికి నామమాత్రంగా కందిపప్పు పంపిణీ చేశారు. ఫిబ్రవరిలో బియ్యంతో పాటు కొంతమందికి పంచదార పంపిణీ చేసి సరిపెట్టేశారు. మార్చిలో అయినా కందిపప్పు ఇస్తారని కార్డుదారులు ఆశగా ఎదురు చూడగా.. అప్పుడు నిరాశే ఎదురైంది. అప్పటినుంచి ఇప్పటివరకూ ఒక్క నెల కూడా కందిపప్పు పంపిణీ చేయలేదు.



బియ్యంతో సరి

ప్రతి నెల రేషన్ కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తున్న ఉచిత బియ్యం మాత్రమే అందజేస్తున్నారు. ఎన్నికల్లో చౌక దుకాణాల ద్వారా అన్ని రకాల పప్పులు రాయితీ ధరలకు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. సరుకులు సక్రమంగా ఇవ్వడం లేదు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించడం లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. నాలుగు నెలలుగా బియ్యం, అరకొరగా చక్కెర తప్ప మిగిలిన సరుకులు ఇవ్వడం లేదు. నాలుగు నెలలుగా కందిపప్పు ఇవ్వకపోవడంతో స్థానికులు చౌక దుకాణ దారులను నిలదీస్తున్నారు. కందిపప్పు సరఫరాలేదని, పంచదార ఇచ్చిన మేరకు అయిపోయిందని స్టాకు రావలసి ఉందని వారు చెబుతున్నారని కార్డుదారులు వాపోతున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ. 67కే..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జిల్లాలో 402 ఎండీయూ వాహనాల ద్వారా కందిపప్పు కిలో రూ.67కే పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఒకటి, రెండు నెలలు మాత్రమే ఎండీయూ వాహనాల ద్వారా అరకొరగా కందిపప్పు పంపిణీ చేసి చేతులెత్తేయడంతో పేద ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.110 ఉంది. జిల్లాలో అధిక శాతం కూలి పనులు చేసుకునే వారే. ప్రభుత్వం పంపిణీ చేసే నిత్యావసరాలే వారికి ఆధారం. ఇందులో కందిపప్పు పూర్తిగా నిలిపివేయడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కందిపప్పు కూడా ఇవ్వలేని సర్కారు తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు.

జిల్లాలో ఇలా...

జిల్లా వ్యాప్తంగా 1,289 చౌక దుకాణాల పరిధిలో 6,34,893 రేషన్ కార్డులు ఉన్నాయి. ఈ కార్డుల్లో సభ్యులుగా ఉన్న 18,09,128 మందికి ప్రభుత్వం ప్రతి నెలా నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తోంది. జిల్లాలో కార్డుదారులకు పంపిణీ చేయడానికి ప్రతి నెల సుమారు 600 టన్నుల కందిపప్పు అవసరం. ప్రతి నెల 20వ తేదీ లోపు రేషన్ డీలర్లు డీడీలు తీసి అవసరమైన సరుకులు దిగుమతి చేసుకుంటారు. అయితే డీలర్లు డీడీలు తీస్తున్నా పౌరసరఫరాల శాఖ మాత్రం కందిపప్పు అరకొరగా 100, 150 టన్నులు మాత్రమే ఇస్తుంది. దీంతో ప్రజలకు పూర్తి స్థాయిలో కందిపప్పు అందడం లేదు. ఈ నెల పూర్తిగా ఆపేశారు. కందిపప్పు కోసం డీడీలు తీయవద్దని అధికారులు ముందుగానే సమాచారం ఇచ్చారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా క్రమం తప్పకుండా కందిపప్పు అందేది. మార్కెట్‌లో ధర పెరిగినా ప్రభుత్వం కొనుగోలు చేసి ప్రజలకు సబ్సిడీపై అందించేది.

దుష్టపాలన అంతానికి పోరాటం

- చంద్రబాబు, లోకేశ్‌లకు బుద్ధి చెప్పి తీరుతాం
- వైఎస్సార్ సీపీ నాయకులందరిపై అక్రమ కేసులు పెడుతున్నారు
- ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారు
- మాజీ మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని
- పోలీసు ఆంక్షలు మీరినట్లు నమోదైన అక్రమ కేసులో విచారణకు హాజరు

సత్తెనపల్లి: రాష్ట్రంలో దుష్ట పాలన అంతానికి అలుపెరగని పోరాటం చేస్తామని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, మాజీ మంత్రి విడదల రజిని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత నెల 18న సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల పర్యటన సందర్భంగా పోలీసు ఆంక్షలు ఉల్లంఘించారంటూ నమోదైన అక్రమ కేసులో విచారణకు అంబటి, రజినిలు సోమవారం హాజరయ్యారు. విచారణ అనంతరం మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నేతలు, మాజీ మంత్రులపై సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని, కుట్రపూరితంగా అక్రమ కేసుల్లో ఇరికిస్తున్నారని ధ్వజమెత్తారు. పోలీసుస్టేషన్లకు తిప్పి వేధించి భయపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం ఎప్పుడూ ఇలాంటి కేసులు పెట్టలేదని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు తమ పార్టీ కార్యక్రమాలకు సత్తెనపల్లి వచ్చి బలప్రదర్శన చేశారని, అప్పుడు తాము వారిపై ఎలాంటి కేసులూ పెట్టలేదని అంబటి పేర్కొన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారని విమర్శించారు.

రాజ్యాంగేతర శక్తిగా డీఎస్ఆర్

సత్తెనపల్లిలో కాంట్రాక్టర్ దరువూరి నాగేశ్వరరావు (డీఎస్ఆర్) రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్నాడని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు విమర్శించారు. నియోజకవర్గ ప్రజలు ఓట్లు వేసిందేమో ఎమ్మెల్యేకి, చేతులు కట్టుకుని నిలుచునేదేమో కాంట్రాక్టర్ దగ్గర..! ఇదెక్కడ విడ్డూరన్నారు. సదరు డీఎస్ఆర్ సత్తెనపల్లిలో ఉన్న స్థలాలన్నీ ఆక్రమించుకుంటున్నాడని, వివాదాల్లో ఉన్న స్థలాలను ప్లాట్లుగా మారుస్తూ సొమ్ము చేసుకుంటూ ఉన్నాడన్నారు.

కూటమి హయాంలో వీధికో బెల్టుషాపు

సత్తెనపల్లిలో నాలుగు బార్లు ఉన్నాయని, వైఎస్సార్ సీపీలో ఆ బార్లు బిడ్‌లు వేసి తీసుకున్నారన్నారు. ఇవాళ వాటిలో ముగ్గురు ఓనర్లు లేరని, డీఎస్ఆర్ ఎవరిని చెబితే వారిని పెట్టారన్నారు. ఓనర్లను తరిమేశారని, ఇంతకన్నా దారుణం ఉండదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు, మేం మంత్రులుగా ఉన్నప్పుడు ఎక్కడైనా బెల్టుషాపులు ఉన్నాయా అని ప్రశ్నించారు. లిక్కర్ స్కామ్ చంద్రబాబు, డీఎస్ఆర్, లోకేష్‌లు కలిసి చేస్తున్నారని, మంత్రులంతా డబ్బులు వసూలు చేసుకునే కార్యక్రమం చేస్తున్నారన్నారు. మాజీ మంత్రి విడదల రజిని, సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి, గుంటూరు మిర్చియార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షురాలు రోళ్ల మాధవి ఉన్నారు.

ఏడాదిగా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు

జనం గుండెల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిర స్థానం సంపాదించారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని చెప్పారు. వైఎస్ జగన్ పర్యటనకు ఎవరినీ పిలవాల్సిన అవసరం లేదని, ఆయన వస్తున్నారంటే ప్రజలే స్వచ్ఛందంగా తరలివస్తారని, గత నెల 18న జనం ఎలా తరలి వచ్చారో అంతా చూశారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే తీవ్ర ప్రజావ్యతిరేకత మూటగట్టుకుందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి విడదల రజిని, పక్కన మాజీ మంత్రి అంబటి రాంబాబు

అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు
- పీజీఆర్ఎస్‌లో 249 అర్జీలు స్వీకరణ

నరసరావుపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ ద్వారా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 249 అర్జీలను జేసీ సూరజ్ గనోరే, డీఆర్ఓ ఏకా మురళితో కలిసి స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటిజాప్యానికి తావులేకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. ఆర్డీఓ కె.మధులత, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరించి వారి సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్, అధికారులు

విద్యుత్ తీగెలు చేతికందుతున్నాయి..

మా గ్రామంలో పురాతన కాలం నుంచి ఉన్న విద్యుత్ స్తంభాలు మార్చాలి. అంతేకాకుండా వాటికి కట్టిన తీగెలు చేతికందేంత ఎత్తులో ప్రమాదకరంగా ఉన్నాయి. వాటిని ఎత్తులో కట్టి, ప్రమాదాల బారిన పడకుండా రక్షించగలరు.

–ఎస్.వెంకట బాలప్రసాదు, సర్పంచ్, చంద్ర రామకృష్ణ, ఎంపీటీసీ. ముక్కొల్లపాడు, నూజెండ్ల మండలం

నూతన పింఛన్లు మంజూరు చేయండి

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని డప్పు కళాకారులు, చర్మకారులకు నూతన పింఛన్లను వెంటనే మంజూరు చేసి మాదిగలు, మాదిగ ఉపకులాలకు న్యాయం చేయండి. చాలా మంది అర్హులు పింఛన్లు అందక ఇబ్బంది పడుతున్నారు.

– చింతిరాల మీరయ్య మాదిగ, జిల్లా అధ్యక్షుడు, ఎమ్మార్పీఎస్. వినుకొండ, ఈపూరు, ముప్పాళ్ల నాయకులు

నాణ్యమైన గుడ్లు, పాలు సరఫరా చేయాలి

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్ల ద్వారా బాలింతలు, గర్భిణులు, చిన్నారులు, విద్యార్థులకు నాణ్యమైన గుడ్లు, పాలు సరఫరా చేయాలి. ఇటీవల ఫుడ్ కమిషన్ సభ్యులు చేసిన తనిఖీలలో నాణ్యతలేనివి సరఫరా చేస్తున్నట్లు బయటపడ్డాయి. పసిపిల్లల ఆరోగ్యాలతో కాంట్రాక్టర్లు, ఉద్యోగులు చెలగాటమాడుతున్నారు.

– ఏపీ బీసీ సంక్షేమ సంఘం, మాలమహానాడు నాయకులు

క్లుప్తంగా

చెల్లని చెక్కు కేసులో శిక్ష ఖరారు

నరసరావుపేటటౌన్: చెల్లని చెక్కు కేసులో నేరం రుజువు అవడంతో దిగువ కోర్టు విధించిన 18 నెలల కఠిన కారాగార శిక్ష, రూ.25 లక్షలు ఫిర్యాదుదారుడికి నష్టపరిహారంగా చెల్లించేలా విధించిన శిక్షను యథాతథంగా ఖరారు చేస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎస్.సత్యశ్రీ సోమవారం తీర్పు వెలువరించారు. పట్టణానికి చెందిన నిందితుడు శ్రీనివాసరావు 2013 ఫిబ్రవరి 27న నాగేశ్వరరావు వద్ద రూ.25 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. దీనికి ప్రామిసరీ నోటురాసి ఇచ్చాడు. చెల్లింపులో భాగంగా 2017 మే 5న రూ.25 లక్షలకు చెక్కు ఇచ్చాడు. నాగేశ్వరరావు చెక్కు తన బ్యాంక్ ఖాతాలో వేసుకున్నాడు. అది చెల్లలేదు, ఈ మేరకు ఆయన కోర్టులో కేసు దాఖలు చేసుకున్నాడు. విచారణలో నేరం రుజువడంతో 2021 జనవరి 20న దిగువ కోర్టు పైవిధంగా తీర్పు వెలువరించింది. నిందితుడు శ్రీనివాసరావు జిల్లా కోర్టులో అప్పీలు దాఖలు చేసుకున్నాడు.

ఉమ్మడి జిల్లా బాడ్మింటన్ పోటీల్లో పతకాలు



నరసరావుపేట ఈస్ట్: ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి బాడ్మింటన్ పోటీల్లో పట్టణానికి చెందిన ఎస్‌కేఆర్‌బీఆర్ ఇండోర్ స్టేడియం బాడ్మింటన్ క్రీడాకారులు పతకాలు సాధించినట్టు కోచ్ డాక్టర్ వి.శరత్‌చందు సోమవారం తెలిపారు. గుంటూరులోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 19, 20వ తేదీలలో జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ నిర్వహించిన 52వ గుంటూరు జిల్లా స్థాయి పోటీలలో అండర్-11 విభాగంలో తమ క్రీడాకారులు బి.దినేష్‌రెడ్డి, వేదవచన్, అండర్-13 బాలికల విభాగంలో కె.చార్వి, షేక్ అఫ్సిన్, అండర్-15 విభాగంలో షేక్ సానియాలు ద్వితీయ స్థానాలు సాధించారని వివరించారు. క్రీడాకారులను ఇండోర్ స్టేడియం చైర్మన్, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, డైరెక్టర్ కె.వి.పురుషోత్తమరావు, అసిస్టెంట్ కోచ్‌లు ఎ.సాయి, షేక్ నసీమా తదితరులు అభినందించారు.

అక్రమ మైనింగ్‌పై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

నరసరావుపేట: జిల్లాలో అక్రమ మైనింగ్‌ను అరికట్టేందుకు జిల్లా, మండల స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేయనున్నామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు వెల్లడించారు. సోమవారం కలెక్టరేట్‌లో పలు అంశాలపై జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, సీటీఓ, మైన్స్ ఏడీ, అదనపు ఎస్పీ, డీఎస్పీలతో కూడిన కమిటీ జిల్లా స్థాయిలో మైనింగ్ కార్యకలాపాలను పర్యవేక్షిస్తుందన్నారు. మండల స్థాయి టాస్క్‌ఫోర్స్‌లో తహసీల్దార్, ఎస్ఐ, రవాణా శాఖ, వాణిజ్య పన్నులు, జీఎస్టీ శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. ఖరీఫ్ సీజన్‌లో పత్తి, మిర్చికి ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసేలా క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. విత్తనాలు, ఎరువుల ధరలు రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రైవేటు డీలర్ల అక్రమాలపై చర్యలు తీసుకోవాలన్నారు. పీ-4 గ్రామసభలలో నియోజకవర్గ, మండల స్పెషల్ ఆఫీసర్లు వివరాలను ధృవీకరించాలన్నారు. దీపం పథకం నగదు బ్యాంకు ఖాతాల్లో జమకాని వారి సాంకేతిక సమస్యలు పరిష్కరించాలన్నారు. రేషన్ షాపుల పనితీరును మెరుగుపరచాలన్నారు.

బంగారు భవితకు నవోదయం

- ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు వరం
- జేఎన్‌వీలో ఆరో తరగతి ప్రవేశాలకు ఆహ్వానం
- 29 వరకు దరఖాస్తు దాఖలుకు గడువు
- డిసెంబర్ 13న ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు
- సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన



మద్దిరాలలోని పీఎంశ్రీజేఎన్‌వీ

చిలకలూరిపేట టౌన్ / యడ్లపాడు: ప్రతిభావంతులైన పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తు చక్కని అవకాశం కల్పిస్తోంది పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయం. చిలకలూరిపేట రూరల్ మండలంలోని మద్దిరాల పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయం 2026-27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. విద్యార్థి భవిష్యత్తుకు బలమైన పునాది వేసే పాఠశాల విద్యలో జవహర్ నవోదయ విద్యాలయాలు మంచి విద్యా ప్రమాణాలను ఉచితంగా అందిస్తున్నాయి. పాఠశాలలో ఆరో తరగతిలో 80 సీట్లు ఉంటాయి. ప్రతిభావంతులైన విద్యార్థులను మాత్రమే వీటికి ఎంపిక చేస్తారు. ఇందుకు కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఏటా ఒక్కో విద్యార్థికి అయ్యే ఖర్చును వెచ్చిస్తుంది. జూన్ 1న ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఈ నెల 29వ తేదీతో దరఖాస్తు దాఖలుకు గడువు ముగియనుంది.

సీబీఎస్ఈ సిలబస్...

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 17 నియోజకవర్గాల పరిధిలో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. పాఠశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులు 6 నుంచి 12వ తరగతి వరకు ఎటువంటి ఖర్చు లేకుండా కో రెసిడెన్షియల్ స్కూల్ ద్వారా సీబీఎస్ఈ సిలబస్‌లో విద్యను అభ్యసించవచ్చు.

సకల సౌకర్యాలు...

భోజనం, వసతి, దుస్తులు, పుస్తకాలు వంటివి అందజేస్తారు. బాలురు, బాలికల కోసం వేర్వేరు వసతి గృహాలున్నాయి. సువిశాల ప్రాంగణం, శాశ్వత తరగతి గదులు, డిజిటల్ పాఠాలకు ప్రత్యేక ఏర్పాట్లు, అధునాతన కంప్యూటర్ ల్యాబ్, రన్నింగ్ ట్రాక్, మైదానం ఉన్నాయి. ఉదయం వ్యాయామం, యోగా సాధన, చిత్రలేఖనం, సంగీతం, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్కౌట్ అండ్ గైడ్, పలు క్రీడల్లో శిక్షణ ఇస్తారు. పాఠ్యాంశాలతోపాటు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు కూడా ఎన్నో పుస్తకాలతో కూడిన గ్రంథాలయం, పూర్తిగా సీసీ కెమెరాలు పర్యవేక్షణ ఉంటుంది. ముఖ్యంగా జేఈఈ, నీట్‌కు కూడా విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తారు. జాతీయ సమైక్యత భావాన్ని పెంపొందించేలా మైగ్రేషన్ (వలస) స్కీమ్ ద్వారా ఇక్కడ 8వ తరగతి చదువుతున్న విద్యార్థులను ఇతర రాష్ట్రాల నవోదయ విద్యాలయాలకు పంపిస్తారు. దీంతో అక్కడి భాషలు, సంస్కృతీ సంప్రదాయాలు తెలుసుకునే చక్కని అవకాశం లభిస్తుంది.

సద్వినియోగం చేసుకోవాలి



నవోదయలో అడ్మిషన్లు పూర్తిగా ప్రతిభ ఆధారం గానే జరుగుతాయి. ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే 750 అర్జీలు వచ్చాయి. పరీక్ష విధానం, ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉంటుంది. ఎలాంటి సిఫార్సులకు తావుండదు. తల్లిదండ్రులు, విద్యార్థులు అపోహలకు లోనవ్వకుండా అప్రమత్తతతో ఉండాలి. 6 నుంచి 12వ తరగతి వరకు ఎలాంటి ఖర్చు లేకుండా విద్యాభ్యాసం సాగించవచ్చు. దరఖాస్తులు గడువులోగా దాఖలు చేయాలి.

– నల్లూరి నరసింహారావు, ప్రిన్సిపల్, పీఎంశ్రీ జేఎన్‌వీ, మద్దిరాల

అర్హులు వీరే...

ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికన అడ్మిషన్లు జరుగుతాయి. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ప్రస్తుతం 5వ తరగతి చదువుతూ ఉండాలి. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుంది. 3, 4, 5 తరగతులు గ్రామీణ ప్రాంతాలలో చదివి ఉత్తీర్ణులైన వారికి ఈ కోటాలో అవకాశం కల్పిస్తారు. విద్యార్థి 2014 మే 1 – 2016 జూలై 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలి. తల్లిదండ్రులు ఉమ్మడి గుంటూరు జిల్లా నివాసితులై ఉండాలి. విద్యార్థి కూడా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని చదువుకొని ఉండాలి.

పరీక్ష విధానం ఇలా...

విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్//నవోదయ.జీవోవీ.ఇన్‌లో లాగిన్ అయి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రవేశ పరీక్ష మొత్తం 80 ప్రశ్నలు 100 మార్కులకు నిర్వహిస్తారు. రెండు గంటల సమయం ఉంటుంది. తెలుగు, ఆంగ్లం, హిందీ, మరాఠీ, ఉర్దూ, ఒరియా, కన్నడ మాధ్యమంలో ప్రశ్నాపత్రం ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు 1.25 మార్కులు కేటాయిస్తారు. ప్రవేశ పరీక్షను అమృతలూరు, బాపట్ల, చిలకలూరిపేట, గుంటూరు, మంగళగిరి, నరసరావుపేట, మాచర్ల, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, తెనాలి, వినుకొండ, రేపల్లె ప్రాంతాల్లో నిర్వహిస్తారు.

మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌కు ఖండన


సమావేశంలో పాల్గొన్న బీసీ నాయకులు, కార్యకర్తలు

- చంద్రబాబు పతనానికి ఇది నాంది
- వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ, ఎస్సీ సెల్ నాయకులు
- మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండించిన నాయకులు
- డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే అక్రమ కేసులు పెట్టారని ఆగ్రహం
- రెడ్ బుక్ రాజ్యాంగానికి భయపడేది లేదని స్పష్టీకరణ

నరసరావుపేట రూరల్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలుస్తున్న నేతలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా జగనన్నకు తోడుగా నిలుస్తామని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సిద్దారపు గాంధీ తెలిపారు. పార్లమెంట్ సభ్యుడు మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో బీసీ, ఎస్సీ సెల్ నాయకులు తీవ్రంగా ఖండించారు. సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శామ్యూల్, ఇంగ్లిష్ మీడియం విద్య పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ చాదినబోయిన ఏడుకొండలు యాదవ్, గాంధీ స్మారక సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఈదర గోపీచంద్, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్, నరసరావుపేట నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు మర్రిపూడి రాంబాబు, గురజాల మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాచర్ల బాబు, బీసీ నాయకుడు అట్లూరి బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అక్రమాలు, అన్యాయాలపై మాట్లాడుతున్న వారి గొంతు నొక్కడమే ధ్యేయంగా అక్రమ కేసులు బనాయిస్తోందని తెలిపారు. అక్రమ కేసులతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీయలేరన్నారు. వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుల మీద కక్షపూరిత రాజకీయాలు చేస్తున్న చంద్రబాబు తన పతనాన్ని తానే కొనితెచ్చుకుంటున్నాడని ఈదర గోపీచంద్ విమర్శించారు. గత ఎన్నికల్లో అక్రమమార్గంలో ఈవీఎంల ద్వారా గెలిచారని ఆరోపించారు. సుప్రీంకోర్టులో ఈవీఎంల మోసాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. శామ్యూల్ మాట్లాడుతూ రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో దాడులు, అక్రమ కేసులు కూటమి ప్రభుత్వం పాల్పడుతుందని తెలిపారు. ఇందులో భాగంగానే మిథున్ రెడ్డిని అరెస్ట్ చేసారని పేర్కొన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భయపడేది లేదని తెలిపారు.

హామీలపై నిలదీస్తారనే భయంతోనే..

కొమ్ము చంద్రశేఖర్ మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ అమలుపై ప్రజలు ఎక్కడ ప్రశ్నిస్తారో అని డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా మిథున్‌రెడ్డిని అక్రమ అరెస్ట్ చేశారని విమర్శించారు. రాష్ట్రంలో అన్ని చోట్ల అక్రమ కేసులు కొనసాగుతున్నాయని, రెడ్‌బుక్ రాజ్యాంగం ఎంతో కాలం నడవదని స్పష్టం చేశారు. ఏడుకొండలు యాదవ్ మాట్లాడుతూ తిరోగమనంలో పయనిస్తున్న చంద్రబాబు ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారని తెలిపారు. అనేక కుంభకోణాల్లో నిందితుడిగా ఉన్న చంద్రబాబు ఇప్పుడు వైఎస్సార్‌సీపీ నాయకులను అణచివేసేందుకు అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. దాడులకు కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.

వేమగిరి వాసులకు

ఇళ్లపట్టాలు, పట్టాదారు పుస్తకాలు ఇవ్వాలి

– కలెక్టరేట్ ముందు ధర్నా చేసిన నాయకులు, గ్రామస్తులు



ధర్నా చేస్తున్న నాయకులు, గ్రామస్తులు

నరసరావుపేట: పిడుగురాళ్ల మండలం వేమగిరి వయా గుత్తికొండ గ్రామంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కులాలకు చెందిన సుమారు 300 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు, సాగుచేసుకుంటున్న భూమికి పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇచ్చి మౌలిక వసతులు కల్పించాలని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు రెడ్‌బాషా ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఈ మేరకు వారితో కలిసి కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. రెడ్ బాషా మాట్లాడుతూ వేమగిరి గ్రామం అనేది కొత్తగా ఏర్పడింది కాదని, స్వాతంత్రం రాకముందే రాజులు, జమీందారుల పాలనలోనే ఈ గ్రామం ఉందన్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు అనేకమైన కుటుంబాలు అక్కడ నివసిస్తున్నాయని, వీరికి కనీస అవసరాలైన తాగునీరు, విద్యుత్తు, రోడ్డు సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వారు నివసిస్తున్న ఇండ్లకు పట్టాలు ఇవ్వాలని, ప్రభుత్వం సంక్షేమ పథకాలలో పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. సుమారు నాలుగువేల ఎకరాలు ఇక్కడున్న పేద కుటుంబాలు సాగు చేసుకుంటున్నారని, వాటికి వెంటనే అడవి హక్కుల చట్టంలో 2006 వచ్చిన మార్పును అనుసరించి రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించే నిత్యావసర వస్తువులు బియ్యం తీసుకునేందుకు వారి గ్రామంలోనే డిపో ఏర్పాటు చేయాలని, గుత్తికొండ గ్రామానికి వెళ్లి తెచ్చుకోవడం చాలా ఇబ్బందికరంగా ఉందని అన్నారు. వెంటనే ఈ సమస్యలు పరిష్కారం చేయాలని వారు డిమాండ్ చేశారు. యువజన నాయకులు పాస్టర్ రమేష్, గురజాల డివిజన్ ఎంసీపీఐయూ నాయకులు మాచర్ల నాగేశ్వరరావు, యువజన సంఘం నాయకులు షేక్ మహబూబ్ బాషా, వేమగిరి గ్రామ రైతులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జిల్లాలో 798.8 మి.మీ. వర్షపాతం

నరసరావుపేట: రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. గడిచిన 24గంటల వ్యవధిలో పల్నాడు జిల్లాలో 798.8 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు తెలియచేశారు. అత్యధికంగా దుర్గి మండలంలో 89.0మి.మీ వర్షం పడగా అత్యల్పంగా మాచవరంలో 4.2 వర్షం పడింది. మండలాల వారీగా పరిశీలిస్తే...మాచర్ల 46.0, వెల్దుర్తి 4.6, రెంటచింత 21.2, గురజాల 6.2, దాచేపల్లి 9.2, కారంపూడి 8.6, పిడుగురాళ్ల 19.2, బెల్లంకొండ 36.6, అచ్చంపేట 10.2, క్రోసూరు 39.8, అమరావతి 45.2, పెదకూరపాడు 35.2, సత్తెనపల్లి 38.2, రాజుపాలెం 42.8, నకరికల్లు 15.4, బొల్లాపల్లి 8.6, వినుకొండ 19.6, నూజెండ్ల 17.6, శావల్యాపురం 16.2, ఈపూరు 18.2, రొంపిచర్ల 47.2, నరసరావుపేట 51.2, ముప్పాళ్ల 36.4, నాదెండ్ల 55.4, చిలకలూరిపేట 39.2, యడ్లపాడు 17.6 మి.మీ వర్షం కురిసింది.

షేర్లలో లాభాల పేరిట రూ.57.20 లక్షల మేర మోసం

- జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేసిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించిన ఎస్పీ


ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ

నరసరావుపేట రూరల్: తమ సలహాలు పాటించి షేర్లలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి రూ.57.20లక్షలు మోసం చేసినట్టు పిడుగురాళ్లకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఫిర్యాదు చేశాడు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆర్థిక, కుటుంబ, మోసం, ఆస్తి తగాదాలకు సంబంధించిన 98 ఫిర్యాదులు ఎస్పీకి అందాయి.

న్యాయం చేయండి

పిడుగురాళ్లకు చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు స్టాక్ అడ్వైజర్ గురించి గూగుల్‌లో సెర్చ్ చేయగా ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీన అజాద్‌సింగ్, సుమత్రా అగర్వాల్‌లు రివైవల్ ప్లాన్ అడ్మిన్లుగా పరిచయం అయ్యారు. పెట్టుబడిపై ప్రతి రోజు 5 నుంచి 10 శాతం లాభం తీసుకువస్తామని నమ్మబలికారు. 11 దఫాలుగా రూ.57,.20లక్షలు వారు చెప్పిన అకౌంట్‌లో డిపాజిట్ చేశాడు. తరువాత రోజు ఏ రోజు ఎంత లాభం వచ్చింది వాట్సాఫ్ గ్రూప్‌లో మెసేజ్ ద్వారా తెలియజేశారు. ఈ విధంగా ఏప్రియల్ 7వ తేదీకి 49,08,750లు లాభం వచ్చినట్టు, ఏఏ స్టాక్‌లలో ఎంత లాభం వచ్చింది వివరాలు వాట్సాఫ్‌లో పంపించారు. పెట్టుబడి, లాభం కలిపి రూ.1.06,28,750 అకౌంట్‌కు పంపుతామని చెప్పి ఫోన్‌లకు స్పందించడం లేదని ఫిర్యాదు చేశాడు.

సీఐపై చర్య తీసుకోవాలి

తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా మాట్లాడిన నరసరావుపేట టూటౌన్ సీఐ హైమారావుతోపాటు తనపై దాడికి ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని సత్తెనపల్లిరోడ్డులోని ఆదిత్య అపార్ట్‌మెంట్‌కు చెందిన న్యాయవాది కె.స్నేహరెడ్డి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. గత వారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఇచ్చిన ఫిర్యాదుపై టూటౌన్ పోలీసులను కలిసి తన పట్ల అసభ్యంగా ప్రవర్తించి దూషించిన ఆనం శివపై చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు. ఎన్నిసార్లు స్టేషన్‌కు వెళ్లినా పట్టించుకోలేదని తెలిపారు. అపార్ట్‌మెంట్ వాసులతో కలసి సీఐ హైమారావును కలవగా తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా మాట్లాడారని తెలిపారు. అంతేకాకుండా శివ కొంతమందితో కలిసి తన ఇంటిపై దాడికి ప్రయత్నించాడని ఫిర్యాదు చేసారు. సీసీ టీవీని పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

కంపెనీ మోసం చేసిందని ఫిర్యాదు

ఎలక్ట్రికల్ బైక్‌లను సరఫరా చేయకుండా, డీలర్‌షిప్ నగదు చెల్లించకుండా కంపెనీ మోసం చేసిందని బెల్లంకొండ మండలం వన్నాయపాలెం చెందిన మేకల సాంబశివరావు ఫిర్యాదు చేశాడు. పంజాబ్‌కు చెందిన అక్కాల్-ఈ- వరల్డ్ పేరుతో ఈటూవైగో పేరుతో ఎలక్ట్రికల్ బైక్‌లను సరఫరా చేస్తామంటే రూ.20 లక్షలు నగదు చెల్లించినట్టు తెలిపారు. కొంతకాలం బాగానే బైక్‌లను సరఫరా చేశారని, గత 8 నెలలుగా బైక్‌ల సరఫరా నిలిపివేసినట్టు వివరించారు. నాలుగు నెలల నుంచి ఫోన్‌కాల్స్ కూడా స్పందించడం లేదని తెలిపారు. ఆన్‌లైన్‌లో డబ్బులు వసూళ్లు చేసి బైక్‌లు ఇవ్వకుండా కొంతమంది కస్టమర్లను మోసం చేసినట్టు తెలిపారు.

రెండో పెళ్లికి సిద్ధమైన భర్తపై చర్యలు తీసుకోవాలని వినతి

తనకు విడాకులు ఇవ్వకుండానే మరో మహిళతో భర్త వివాహనికి సిద్ధమయ్యాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని చిలకలూరిపేట కుమ్మరి బజార్‌కు చెందిన నక్కల చిన్నిపార్వతి ఫిర్యాదు చేసింది. అదే ప్రాంతానికి చెందిన నాగప్రవీణ్‌తో ఎనిమిదేళ్ల కిందట వివాహం కాగా ఇద్దరు సంతానం ఉన్నారని తెలిపింది. నన్ను, పిల్లలను సరిగా పట్టించుకోకపోడంతో పట్టింటి వద్దనే ఉంటున్నానని, ఇప్పుడు వేరే మహిళతో వివాహం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని తెలిపింది. నాగప్రవీణ్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరింది.

చేనేత సహకార సంఘాలకు రూ. 156 కోట్లివ్వాలి

ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి డిమాండ్


మాట్లాడుతున్న పిల్లలమర్రి బాలకృష్ణ

సత్తెనపల్లి: చేనేత సహకార సంఘాలకు రావాల్సిన యారన్ సబ్సిడీ, పావలా వడ్డీ, రిబేట్ మొత్తం రూ. 156 కోట్లు వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో సోమవారం జరిగిన ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సమావేశానికి చేనేత కార్మిక సంఘ నేత కట్టా శివ దుర్గారావు అధ్యక్షత వహించారు. బాలకృష్ణ మాట్లాడుతూ అక్టోబర్ 6,7వ తేదీలలో సత్తెనపల్లిలో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. చేనేత రంగాన్ని పరిరక్షిస్తామని, కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుకు చర్యలు చేపడతామని కూటమి నేతలు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాదైనా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రతి చేనేత కుటుంబానికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మహాసభలలో సమస్యలపై చర్చించి కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామన్నారు. చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య మాట్లాడుతూ చేతివృత్తిదారులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. సామాజిక రక్షణ చట్టంలో కొన్ని వృత్తులకు రక్షణ కల్పిస్తామని చెప్పి 8 మంది మంత్రులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారని, ఇప్పటివరకు చర్యలు చేపట్టలేదన్నారు. కార్పొరేషన్లకు విధివిధానాలు లేకపోవడంతో 56 కార్పొరేషన్ల వల్ల వృత్తిదారులకు ప్రయోజనం జరగలేదన్నారు. రాజకీయ నిరుద్యోగులకు ఉపయోగపడుతున్నట్లు ఆరోపించారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శులు దూకిపర్తి రామారావు, వాసా గంగాధరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు అనుముల వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

మిర్చి యార్డు సమాచారం (సోమవారం ధరలు)



వచ్చిన బస్తాలు	47,858
అమ్మకాలు	44,971
నిల్వ	6,252

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,000
నంబరు-5	10,000-13,400
341	10,000-13,600
సూపర్ -10	10,000-13,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-12,500
నంబరు-5	10,000-13,600
341	10,000-13,500
4884	10,000-12,700

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,000
బాడిగ-355	10,000 - 12,300
దేవనూరు డీలక్స్	10,000 - 12,500
ఆర్మూర్	9,600 - 10,800
తాలుకాయలు	5,000 - 6,900

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-13,800
బాడిగ - 355	10,000-12,700
దేవనూరు డీలక్స్	10,000 - 12,600
తాలు	5,200 - 7,000

-కొరిటెపాడు (గుంటూరు)

ప్రీ మారిటల్ కౌన్సెలింగ్ సెంటర్లను వినియోగించుకోండి


కలెక్టరేట్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్, జేసీ, ఇతర అధికారులు

పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్, జేసీ, అధికారులు

నరసరావుపేట: వివాహం అనంతరం కుటుంబాలను సమర్థంగా నిర్వహించుకునేందుకు మిషన్ శక్తికి చెందిన ప్రీ మారిటల్ కౌన్సెలింగ్ సెంటర్లను వివాహాలు చేసుకోబోయే జంటలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కౌన్సెలింగ్ సెంటర్లకు చెందిన పోస్టర్ ఆవిష్కరించారు. దీనిపై జిల్లా మహిళా, శిశుసంక్షేమ సాధికారిత అధికారి ఎం.ఉమాదేవి మాట్లాడుతూ జాతీయ మహిళా కమిషన్ మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహిస్తుందన్నారు. దేశంలోని తొమ్మిది రాష్ట్రాల్లో వివాహానికి ముందు కౌన్సెలింగ్ కేంద్రాలను ప్రారంభించిందన్నారు. తేరే మేరే సప్నే అని పిలవబడే ఈ కేంద్రాలు వివాహానికి సంబంధించిన సామాజిక, మానసిక, ప్రవర్తనా అంశాలపై జంటలకు మార్గదర్శకాలు అందించటమే లక్ష్యంగా ఏర్పాటుచేసిందన్నారు. వివాహం చేసుకోబోయే జంటలకు తల్లితండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా సమర్ధవంతంగా కుటుంబాన్ని నిర్వహించుకునేలా చేస్తారన్నారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, ఆర్డీఓ కె.మధులత, అధికారులు ఆవిష్కరణలో పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాధితుడు మృతి


శ్రీను (ఫైల్)

నూజెండ్ల: మండలంలోని ఐనవోలు గ్రామంలో ఇటీవల జరిగిన పెట్రోల్ దాడిలో చికిత్స పొందుతూ పెద్ద శ్రీను సోమవారం మృతి చెందినట్లు కుటుంట సభ్యులు తెలిపారు. ఈ నెల 16వ తేదీ తెల్లవారుజామున ఆరుబయట నిద్రిస్తున్న దంపతులు నీలబోయిన పెద్ద శ్రీను, మంగమ్మ దంపతులపై దుండగులు పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఈ సంఘటనలో మంగమ్మ మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన పెద్ద శ్రీనును గుంటూరు వైద్యశాలకు తరలించారు. ఆరు రోజులుగా చికిత్స పొందుతూ బాధితుడు శ్రీను సోమవారం మరణించాడు. ప్పటికే ఐనవోలు పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించిన విషయం విదితమే.